క్లుప్తంగా

మీకోసం.. అధికారుల ఆలస్యం


పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

పెరవలి: కూటమి ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీ కోసం) అపహాస్యం అవుతోంది. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించాలి. మీ కోసం నిర్వహణలో కీలకమైన తహసీల్దార్ డి.అచ్యుత కుమారి గంట ఆలస్యంగా ఉదయం 11 గంటలకు కార్యాలయానికి వచ్చారు. ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ పత్తా లేరు. ఇక మిగిలిన శాఖల అధికారులు వచ్చినా కార్యాలయం బయటే తచ్చాడారు. దాంతో అప్పటికే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న అర్జీదారులు అధికారుల కోసం పడిగాపులు కాశారు.అంతేగాకుండా అధికారులకు మరొక వెసులుబాటు లభించింది, ఈ కార్యలయంలోని టీవీ పనిచేయడం లేదు. ఆ టీవీ పని చేస్తుంటే జిల్లా కలెక్టర్ నేరుగా ఇక్కడ ఏం జరుగుతున్నదీ పరిశీలించే అవకాశం ఉండేది. జిల్లా కలెక్టర్ చూసే అవకాశం లేదు కాబట్టి అధికారులు కూడా ఎప్పుడొచ్చినా ఫర్వాలేదులే అన్న ధీమాగా ఉంటున్నారు. దీనిపై తహసీల్దార్ అచ్యుతకుమారిను వివరణ అడిగితే 10 నిముషాల తక్కువ 11 గంటలకు కార్యాలయానికి వచ్చానని సమాధానం చెప్పారు.

వైభవంగా అనఘాష్టమి వ్రతాలు


ఆలయంలో అనఘాష్టమి వ్రతాలు చేస్తున్న మహిళా భక్తులు

నిడదవోలు: అనఘాష్టమి సందర్భంగా సోమవారం పట్టణంలోని సోమేశ్వర స్వామివారి ఆలయంలో మహిళా భక్తులు అనఘాష్టమి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలభైరవ స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈవో సోమాల శివ, అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్‌శర్మ పాల్గొన్నారు.

జంట నాగుల ప్రతిష్ఠా మహోత్సవం

గోపాలపురం: స్థానిక లక్ష్మీ గణపతి ఆలయంలో సోమవారం జంట నాగుల ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కె రవితేజ దంపతుల సౌజన్యంతో ఈ వేడుక జరిగింది. జాతక రీత్యా సకల దోష పరిహారార్థం, గణపతి పూజ, పుణ్యాహవచనం, సర్వతో భద్రమండలి పూజ, మహా రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, జంట సర్పాలకు క్షీర, జలాభిషేకాలు నిర్వహించినట్టు ఆలయ ప్రధానార్చకుడు గౌతంశర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన గణిత అవధానం

నల్లజర్ల: పోతవరం జెడ్పీ హైస్కూల్లో సోమవారం 8వ తరగతి విద్యార్థి మోహన్‌కృష్ణ ఎనిమిది మంది విద్యార్థులతో నిర్వహించిన గణిత అవధానం అలరించింది. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని అ అవధానం నిర్వహించారు. తొలుత రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోపి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యంను ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కె.లక్ష్మీప్రసన్న, అన్నె రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కొవ్వూరు: వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి పశివేదల గ్రామానికి చెందిన ముగ్గురికి రూ.2.52.368 విలువైన చెక్కులను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం పంపిణీ చేశారు.గ్రామానికి చెందిన దండు లక్ష్మికి రూ.1,87,368 ,యలమాటి నాగవల్లి తాయారు రూ.35 వేలు, గాది రాజుకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, నాయకులు బేతిన నారాయణ, సూరపనేని చిన్ని, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం సర్వీసు రోడ్డులో ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఆదివారం రాత్రి 10.30 సమయంలో బైక్ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో దూబచర్లకు చెందిన కంచెర్ల పోతురాజు (24) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోతురాజు లక్ష్మీనగర్ సమీపంలోని సుగుణ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అతడు ఆదివారం ఫ్యాక్టరీలో డ్యూటీని ముగించుకుని రాత్రి తన బైక్‌పై ఇంటికి తిరిగి వస్తూ ఘంటావారిగూడెం శివార్లలో ఆగి ఉన్న ట్రాక్టరు ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. తలకు తీవ్ర గాయమైన పోతురాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ఫలహారం


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో నిర్మాణంలో ఉన్న మినీ గోకులం షెడ్డు


నిడదవోలు మండలంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డు (ఫైల్)

- గోకులాల మంజూరులో కూటమి నేతల పెత్తనం
- పంచాయతీ తీర్మానం కోసం సర్పంచులపై ఒత్తిళ్లు
- నియోజకవర్గానికి 152 మినీ గోకులం షెడ్ల మంజూరు

నిడదవోలు రూరల్: పశు పోషణపై ఆధారపడిన చిన్న,సన్నకారు పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన మినీ గోకులం పథకం కూటమి పార్టీల నేతల వశమవుతోంది. పశువులకు నీడనిచ్చే పథకంపైనా కుటిల రాజకీయం చేస్తున్నారు. తమ వర్గం వారికే మినీ గోకులాలు కావాలని ఆయా గ్రామాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. తమకు అనుకూలురతో దరఖాస్తు చేయించి మంజూరు చేయించుకుంటున్నారు. నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో ఎంపీపీలుగా, సర్పంచులుగా వైఎస్సార్ సీపీకి చెందిన వారే ఉన్నారు. దాంతో వారికి ఒకటి, రెండు ఇచ్చి మిగిలిన మినీ గోకులాలన్నీ కూటమి పార్టీల కార్యకర్తలకు దక్కేలా ప్లాన్ చేశారు. తమ పార్టీల వారికే కచ్చితంగా ఇవ్వాలని అధికారులకు మౌఖిక ఆదేశాలిస్తున్నారు.


సమిశ్రగూడెంలో పాడైపోయిన కొబ్బరి ఆకుల షెడ్డులో ఉన్న పశువులు

పాడి రైతులకు అన్యాయం

మినీ గోకులాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ పాడి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రధానంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, మహిళలు, దివ్యాగులకు ప్రాధాన్యం కల్పించాలి. అర్హులు తమ దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, స్థలం హక్కుపత్రం, బ్యాంకు పుస్తకం జత చేసి సంబంధిత ఎంపీడీఓకు అందజేయాలి. పశువైద్యులు గ్రామానికి వచ్చి రైతుకు పశువులు? ఉన్నాయా? లేదా అని పరిశీలిస్తారు. ఉపాధిహామీ ఏపీఓలు షెడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, రైతు అర్హతలను పరిశీలించి ఆన్‌లైన్ చేస్తారు. అనంతరం రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేస్తారు.

షెడ్ల రకాలు.. సబ్సిడీ వివరాలు

షెడ్డు	యూనిట్ ధర	సబ్సిడీ రూ. (90 శాతం)	రైతు వాటా రూ. (10 శాతం)
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 పశువులు	2,30,000	2,07,000	23,000

152 మినీ గోకులం షెడ్ల మంజూరు

నిడదవోలు డివిజన్ పశుసంవర్ధకశాఖ పరిధిలో సుమారు రూ.3 లక్షల ఆవులు, గేదెలు, ఇతర పశువులు ఉన్నాయి. నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు 152 మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయి. పలు గ్రామల్లో పశువులకు సరైన వసతి షెడ్లు లేవు. పశువుల షెడ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని రైతుల కోసం ఈ పథకం ప్రవేశపెట్టినట్టు ప్రకటనలే తప్ప ఆచరణలో కానరావడం లేదు. కేటాయింపుల్లో అధికార పార్టీ నాయకుల సిఫార్సులకే అధికార యంత్రాంగం ప్రాధాన్యం ఇస్తున్నారు. పాడి పశువుల లేని వారికి కూడా గోకులం షెడ్లు మంజూరు చేయాలని అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. వర్షంలో తడుస్తూ, ఎండలో ఎండుతూ ఇబ్బందులు పడుతున్న వారి పశువుల కోసం గోకులం షెడ్లు మంజూరు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. పశువైద్యాధికారి, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు కూడా అధికారి పార్టీ నాయకులు చెప్పిన వారి వద్దే దరఖాస్తులు తీసుకున్నారు. గోకులం షెడ్లు మంజూరు జాబితాలో కూటమి నాయకుల వారివే ఎక్కువగా ఉన్నాయి. అర్హత ఉండి గోకులం షెడ్ కోసం దరఖాస్తు చేసుకున్న సామన్య పాడి రైతులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది.

> **అర్హులకే షెడ్ల మంజూరు**
>
> ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అర్హతలూ ఉన్న చిన్న, సన్నకారు రైతులకే మినీ గోకులం షెడ్లు మంజూరు చేస్తున్నాం. లబ్ధిదారులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కావాలి. అనువైన స్థలం, పశువులు ఉండాలి. ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తారు. షెడ్లు నిర్మాణంలో ప్రతి దశలోనూ ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ చేయాలి.
>
> – డాక్టర్ వి.రుషిప్రసాద్, ఏడీ, పశుసంవర్ధక శాఖ, నిడదవోలు

సర్పంచులపై ఒత్తిళ్లు

గోకులం షెడ్లు మంజూరు లిస్టులో ఉన్న పేర్లన్నింటికి పంచాయతీ తీర్మానం ఇవ్వాలంటూ అధికార పార్టీ నాయకులు ఎంపీడీఓతో కలిసి సంబంధిత సర్పంచులపై ఒత్తిడి తెస్తున్నారు. వాస్తవంగా పాడి పశువులు ఉండి లిస్టులో పేర్లు ఉండే పాడి రైతులకు మాత్రమే సర్పంచులు తీర్మానం కాపీ ఇస్తున్నారు. అలా కాకుండా అందరికీ పంచాయతీ తీర్మానం ఇవ్వాలంటే కుదరదని సర్పంచులు చెబుతున్నారు. దీంతో కూటమి నాయకులు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులను అడ్డం పెట్టుకుని తీర్మానాలు చేయిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడి రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వంలో ఇలాంటి వాటిని పట్టించుకోకుండా తమ కార్యకర్తల కోసం షెడ్లు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అర్జీదారులకు సత్వర న్యాయం చేయండి


ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీ కోసం కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పది ఫిర్యాదులు అందాయన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్‌లోని అన్ని మండల కార్యాలయాల్లోనూ అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల నుంచి రక్షణ

చాగల్లు: హెల్మెట్ ధరించి వాహనాలు నడపితే అనుకోని ప్రమాదం సంభవించినా ప్రాణాలను కాపాడుతుందని చాగల్లు ఎస్సై కె.నరేంద్ర అన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా సోమవారం చాగల్లులో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఎస్సై నరేంద్ర మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలవడం వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఎందరో చిన్నారులు అనాథలు అవుతున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. అతి వేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ రైడింగ్ చేయవద్దన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ఎంవీ యాక్ట్ ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ప్రొటోకాల్‌కు అధికారుల చెల్లుచీటీ

- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదు
- ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు ధ్వజం
- మండల పరిషత్ సమావేశంలో టీడీపీ నాయకుల హల్‌చల్


మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎంపీటీసీ సభ్యులు. మధ్యలో టీడీపీ నాయకులు

తాళ్లపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం దక్కడం లేదని ఆరోపించారు. తాళ్లపూడి మండల పరిషత్ సమావేశం సోమవారం ఎంపీపీ పోశిరాజు అధ్యక్షతన తాళ్లపూడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోశిరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే అందరినీ కలుపుకుని వెళ్లే వ్యక్తి అయినప్పటికీ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. అన్ని విషయాలూ ఎంపీపీకి, సర్పంచులకు చెప్పనవసరం లేదని అధికారులు అంటున్నారన్నారు. దీనిపై సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఏ పార్టీ వారైనా అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలన్నారు. అధికారిక కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు అందరినీ పిలవాలన్నారు. అభివృద్ధి విషయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌ల సహకారం అవసరం అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, విద్యుత్, గృహనిర్మాణ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, ఆరోగ్యం, విద్యుత్, పంచాయతీరాజ్, రెవెన్యూ, వెటర్నరీ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను సమావేశంలో వివరించారు. తమ గ్రామంలో సారా సమస్య ఎక్కువగా ఉందని గజ్జరం ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి సమావేశం దృష్టికి తెచ్చారు. పైడిమెట్ట– గజ్జరం రోడ్డుపై రాత్రిపూట స్క్రాబ్‌ను కాల్చడం వల్ల విపరీతమైన కాలుష్యం వస్తోందన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ ప్రకటించారు. సమావేశంలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, డిప్యూటీ తహసీల్దార్ భారతి, వైస్ ఎంపీపీలు కొండేపాటి రత్నకుమారి, కోదాటి కనకయ్య, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా ప్రొటో కాల్‌ను పక్కనబెట్టి మండల పరిషత్ సమావేశానికి ఎక్కువ మంది టీడీపీ నాయకులు హాజరయ్యారు. అధికారులు కూడా వారిని బయటకు పంపకపోవడం గమనార్హం.

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు మోక్షం

స్పందించి అధికారులను ఆదేశించిన మంత్రి దుర్గేష్

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: మొరాయించిన అన్నవరప్పాడు పంచాయతీ ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. నిధులు మంజూరై, టెండరు ఖరారైనప్పటికీ కూడా ఈ ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టకుండా కూటమి నాయకులు మోకాలడ్డుతున్నారంటూ ఇటీవల 'సాక్షి' వచ్చిన కథనాలకు మంత్రి దుర్గేష్ స్పందించారు. పది హేనేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్ నిర్వహణ కొరవడడంతో 24 రోజుల క్రితం పూర్తిగా పని చేయడం మానేసింది. దాంతో ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. మరోపక్క మరమ్మతులు జరగకుండా స్థానిక కూటమి నాయకులు సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ వ్యవహారంపై 'సాక్షి'లో వారం వ్యవధిలో రెండు సార్లు కథనాలు ప్రచురితం అయ్యాయి. వాటికి స్పందించిన మంత్రి దుర్గేష్ అన్నవరప్పాడు వెళ్లి సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, ఎంపీడీవో సీహెచ్ వెంకటరమణలను ఆదేశించారు. దాంతో వారిద్దరూ సోమవారం ఈ గ్రామం వెళ్లి పాడైన ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. వారిచ్చిన సమాచారం మేరకు ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ కూడా అక్కడకు వచ్చారు. ఇరువర్గాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకున్నారు. దాంతో మంగళవారం నుంచి ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేపడతామని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రకటించారు.


అన్నవరప్పాడు ఆర్వో ప్లాంట్ వద్ద పంచాయతీ, రెవెన్యూ అధికారులు

కూటమి వైఫల్యాలు ఎండగట్టాలి


పోరుబాట కరపత్రాన్ని చూపుతున్న మాజీ మంత్రి తానేటి వనిత, రాజబాబు తదితరులు

- 27న 'పోరుబాట' విజయవంతం చేయండి
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ మంత్రి వనిత పిలుపు

ద్వారకాతిరుమల: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత పిలుపు నిచ్చారు. స్థానిక కాపు కల్యాణ మంటపంలో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ మండల నాయకుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఆమె వైఎస్సార్ సీపీ పోరుబాట కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం వాటిని పార్టీ నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వనిత మాట్లాడుతూ కరెంటు చార్జీల బాదుడుపై ఈనెల 27న అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ పోరుబాట నిర్వహిస్తోందన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అధికారులకు వినతిపత్రం అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, పోల్కంపల్లి అనిల్‌బాబు పాల్గొన్నారు.

నివాసయోగ్యమైన స్థలాలు ఇవ్వండి

రెవెన్యూ సదస్సులో లబ్ధిదారుల విజ్ఞప్తి

దేవరపల్లి: జగనన్న లే అవుట్‌లో కేటాయించిన స్థలాలు నివాస యోగ్యంగా లేవని, నివాసయోగ్యంగా ఉండే ప్రదేశంలో స్థలాలు ఇవ్వాలని ధుమంతునిగూడెం లబ్ధిదారులు అధికారులను కోరారు. ధుమంతునిగూడెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ శ్రీరంగం రామలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మికి గ్రామస్తులు అర్జీలు అందజేశారు. 2022లో గ్రామానికి చెందిన 125 పేద కుటుంబాలకు పోలవరం కుడి కాలువ గట్టుకు దిగువన ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. స్థలాలు లోయ ప్రాంతంలో ఉండడం వల్ల వర్షాకాలంలో మునిగిపోతున్నాయని, కనీసం రోడ్డు సదుపాయం లేదని లబ్ధిదారులు వాపోయారు. ఈ స్థలాలు నివాసయోగ్యంగా లేవని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని లబ్ధిదారులు వాపోయారు. 2023లో అప్పటి జిల్లా కలెక్టర్ స్థలాలను పరిశీలించి రోడ్డు సదుపాయం కల్పించి, స్థలాలను మెరక చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించినప్పటికీ పనులు జరగలేదన్నారు. ఈ స్థలాలు నివాసయోగ్యంగా లేనందున మరొక చోట స్థల సేకరణ చేసి పట్టాలు ఇస్తే ఇళ్లు కట్టుకుంటామని ప్రజలు తహసీల్దార్ రాజ్యలక్ష్మిని కోరారు. దీంతో తహసీల్దార్ స్థలాలను పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆమె తెలిపారు. గ్రామంలోని పలు భూముల సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేసి పరిష్కరించాలని కోరారు. ధుమంతునిగూడెం, కృష్ణంపాలెం గ్రామాల రెవెన్యూ సదస్సు ఇక్కడ నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


నల్లజర్ల సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దారు శాంతిప్రియ


ధుమంతునిగూడెంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

నల్లజర్ల సదస్సులో 20 అర్జీలు

నల్లజర్ల: భూ సమస్యల పరిష్కారానికి నల్లజర్లలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ రైతుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ అంశాలకు సంబంధించి 20 అర్జీలు వచ్చినట్టు వీఆర్వో చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు మూర్తి, మధు, శామ్యూల్, సురేష్, పంచాయతీ కార్యదర్శి కిశోర్ పాల్గొన్నారు.


డాక్యుమెంట్స్ పోయినవి

కొడవలి పోలేశ్వరరావు s/o సోమరాజు అనునేను దుద్దుకూరు నివాసిని. నేను 12-12-2024న మా ఇంటి నుండి జిరాక్స్ షాపుకి మా డాక్యుమెంట్ (నెంబరు 3915/2010 SRO కొవ్వూరు) బైక్ కవర్‌లో పెట్టుకుని వెళ్తుండగా పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

84650 25144

ఊరూరా క్రిస్మస్ సందడి ప్రారంభం

తాళ్లపూడి: కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా క్రిస్మస్ సందడి ప్రారంభమైంది.పెద్దేవం గ్రామంలోని ఎబ్రోన్ చర్చిలో సంఘ పెద్ద బట్టు సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. సంఘస్తులు, నాయకులతో కలసి ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచులు తిగిరిపల్లి వెంకట్రావు, గండి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కవల నాగేశ్వరరావు, కొయ్యే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


చాగల్లు మండలం ఎస్. ముప్పవరంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్


పెద్దేవం క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


నిడదవోలు ఎస్టీ కాలనీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రంలో..

నిడదవోలు: స్థానిక ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం నెంబర్ 135లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల క్రిస్మస్ తాతతో పాటు వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ గీతాలకు అనుగుణంగా చిన్నారులు నృత్యాలు చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పి.పద్మావతి, ఉపాధ్యాయుడు రామకృష్ణ, హెల్పర్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్స్

చాగల్లు: క్రిస్మస్ సందర్భంగా ఇళ్లు, ప్రధాన కూడళ్లు, చర్చిల వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్లు ఆకట్టుకుంటున్నాయి. చాగల్లు, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, గౌరిపల్లి, నందిగంపాడు గ్రామాల్లో ఈ స్టార్‌లను ప్రధాన రోడ్ల పక్కనే ఏర్పాటు చేయడంతో అటువైపు ప్రయాణించే వాహనదారులు ఆసక్తిగా గమనిస్తున్నారు. క్రిస్మస్ ట్రీలు, పశువుల పాకలను కూడా ఏర్పాటుచేశారు.

